## దటీజ్ తెలంగాణ

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిర క్యాంటీన్లకు మంగళం పాడుతున్నది. నిధుల లేమితో ఇప్పటికే 23 క్యాంటీన్లు, 11 కిచెన్లకు తాళం వేసింది. మరమ్మతుల పేరుతో మరో 50 క్యాంటీన్లకు చెక్ పెట్టేందుకు యోచిస్తున్నది. తెలంగాణలో 2014 నుంచి అమలవుతున్న అన్నపూర్ణ పథకం (రూ.5భోజనం )ద్వారా ఏప్రిల్ నాటికి 10.52 కోట్ల మందికి నాణ్యమైన భోజనం అందించింది.



సంక్షేమం

పట్టణ ప్రజల శారీరక దారుఢ్యం, పార్కుకు వచ్చే పిల్లలకు ఉపయోగపడేలా రాష్ట్రంలోని 141 పట్టణాల్లో 444 వరకు ప్రభుత్వం ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది. దీంతో పట్టణ ప్రజలకు ఆరోగ్యంతో పాటు శారీరక రుగ్మతలు దూరమయ్యాయి.

ఓపెన్ జిమ్‌లు

| | |
|---|---|
| ప్రారంభం | 2020 |
| జిమ్‌ల నిర్మాణం | 444 |
| లబ్ధి పొందిన పట్టణాలు | 141 |

మనమే నెంబర్ 1




## డాక్టర్ చదువు.. కొలువు.. మన దగ్గరే..

తెలంగాణ ఏర్పడేనాటికి 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. దీంతో సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలోనే నాలుగు మెడికల్ కాలేజీలను స్థాపించారు. కిందటేడాది 8, ఇటీవల మరో తొమ్మిది కాలేజీలను ప్రారంభించారు. తొమ్మిదిన్నరేండ్లలో 21 మెడికల్ కాలేజీల ప్రారంభంతో మొత్తం వీటి సంఖ్య 26కు చేరింది. వచ్చే ఏడాది మరో 8 ప్రారంభం కానున్నాయి. వీటికి సంబంధించి ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయి.



"తొమ్మిదిన్నరేండ్లలో మెడికల్ కాలేజీల్లో మార్పు ఇది

2014: **5**
2023: **26**

420% పెరుగుదల

**విశేషం:** 2015-16లో వైద్యారోగ్యశాఖకు బడ్జెట్‌లో రూ. 4,932 కోట్లు కేటాయిస్తే, 2023-24 బడ్జెట్‌లో ఇది రూ. 12,364 కోట్లకు చేరింది. తలసరి వైద్యబడ్జెట్ కేటాయింపు రూ. 3,532తో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నది. రాష్ట్రం ఏర్పడినప్పుడు ఐదు మెడికల్ కాలేజీల సంఖ్య ప్రస్తుతం 26కు చేరింది.

### ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటు

**1946-47**
ఉస్మానియా, హైదరాబాద్

**1954-55**
గాంధీ, హైదరాబాద్

**1959-61**
కాకతీయ మెడికల్ కాలేజీ, వరంగల్

**2016-17**
మహబూబ్‌నగర్, సిద్దిపేట


**2018-19**
నల్లగొండ, సూర్యాపేట

**2022-23**
మంచిర్యాల, రామగుండం, జగిత్యాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి

**2023-24**
కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామ.

**2024-25**
(రాబోయే కాలేజీలు) జోగుళాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి.

ఎన్నికల ప్రచారంలో జరిగే ఎలాంటి కార్యక్రమంలోనైనా పాల్గొనే సాధారణ ప్రజల ముఖ కవళికల ఆధారంగా వారి మూడ్‌ను అంచనా వేసేందుకు టెక్ నిపుణులు సరికొత్త టెక్నాలజీని డెవలప్ చేస్తున్నారు. ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ ముంబై కంప్యూటర్ నిపుణులు చేపట్టిన ఈ ప్రాజెక్టు సమీప భవిష్యత్తులో జరిగే ఎన్నికల ప్రక్రియలో కీలకంగా మారనున్నదని అభిప్రాయపడుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పనిచేసే ఈ విధానం త్వరలోనే అందుబాటులోకి రానున్నది.




# ఎలక్షన్ మూడ్ ఏఐ చెప్పేస్తుంది..

ఎన్నికల కోసం నయా టెక్నాలజీ .. బహిరంగ సభలు, ర్యాలీల్లో పాల్గొనే ప్రజల ముఖ కవళికల ద్వారా అంచనా.. త్వరలో అందుబాటులోకి సాఫ్ట్‌వేర్

### ఐఐటీ హైదరాబాద్, ముంబై ఏఐ నిపుణుల కసరత్తు

"ఎన్నికలు వచ్చాయంటే ర్యాలీలు, సభలు, వాహనాల శ్రేణితో జరిపే పాదయాత్రలతో అంతా సందడి వాతావరణం నెలకొంటుంది. అయితే, ఇందులో పార్టీ కోసం పని చేసే కార్యకర్తల కంటే ప్రచారంలో పాల్గొనే సాధారణ జనాలే ఎక్కువగా ఉంటారు. టీవీల్లో కనిపించే నాయకులను కళ్లారా చూసేందుకు కొందరు వస్తుంటారు.

**స్థానిక** నేతల ప్రోద్బలంతో సమూహంలో కలిసేవారు మరికొందరు ఉంటారు. ఇలా ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొనే జనాల మూడ్‌ను అంచనా వేసేందుకు ప్రత్యేక టెక్నాలజీని డెవలప్ చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ) ఆధారంగా పనిచేసే విధానం ద్వారా సమావేశాలు, మహాసభలు, ర్యాలీల్లో పాల్గొన్న జనాలు సంబంధిత పార్టీ గురించి ఏమి ఆలోచిస్తున్నారనే విషయాన్ని తెలుసుకునేలా డిజైన్ చేస్తున్నారు. ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ ముంబై కంప్యూటర్ నిపుణులు చేపట్టిన ఈ ప్రాజెక్టు రాబోయే ఎన్నికల్లో కీలకంగా మారనున్నదని టెక్ నిపుణులు చెబుతున్నారు. టెక్నాలజీ పరిధి విస్తరిస్తున్నది. ఇప్పటికే ఏఐ మెషిన్ లెర్నింగ్ ఆధారిత టెక్నాలజీల సాయంతో అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకుపోతున్నది. తాజాగా రాజకీయాల్లోనూ ఈ అధునాతన టెక్నాలజీ ప్రాధాన్యత పెరుగుతున్నది. ప్రస్తుతం దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సందడి నెలకొనడంతో.... ఓవైపు డిజిటల్ మీడియా, మరోవైపు ఏఐ, ఎంఎల్ వంటి టెక్నాలజీతో కూడిన వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నిపుణులు కృషి చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ ఐఐటీ, ముంబై ఐఐటీ టెక్ నిపుణులు ఏఐ ఆధారిత వ్యవస్థను డిజైన్ చేసేందుకు సిద్ధమయ్యారు.

### జనాల మూడ్ పసిగట్టేలా...

**ఎన్నికల** సందర్భంగా జరిగే సభలు, సమావేశాలు, ర్యాలీలు, వాహనాల యాత్రలు, పాదయాత్రల్లో పాల్గొనే జనాల మూడ్‌ను పసిగట్టేందుకు ఈ టెక్నాలజీని డెవలప్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రపంచంలోని పలు దేశాల్లో ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ అనాలసిస్ టెక్నాలజీని నిపుణులు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీని ద్వారా ముఖ కవళికలను బట్టి వారి మానసిక స్థితి, ఆరోగ్య పరిస్థితి, ఆలోచన పరిపక్వత, శారీరక రుగ్మతలను అంచనా వేస్తున్నారు. అలాంటి సమాచారానికి అదనంగా మరి కొన్ని అంశాలను జతచేసి జనాల మూడ్, ఆలోచనా ధోరణిని టెక్నాలజీ ద్వారా విశ్లేషించేలా ఏఐని రూపకల్పన చేస్తున్నారు. ఒకసారి సభలు, సమావేశాలకు హాజరైన వారి వీడియోలు, ఫొటోలను ఏఐతో కూడిన అనాలసిస్ వ్యవస్థకు అనుసంధానం చేయగానే వాటిని విశ్లేషించి సంబంధిత కార్యక్రమంపై అభిప్రాయాన్ని హావభావాలు సహా గుర్తించేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఈ తరహా టెక్నాలజీ ప్రయోగ దశలో ఉండగా... త్వరలోనే అందుబాటులోకి వస్తుందని, దీంతో జనాల మూడ్‌ను కచ్చితంగా అంచనా వేసేందుకు వీలు కలుగుతుందని ఐఐటీ హైదరాబాద్ టెక్ నిపుణులు భావిస్తున్నారు.



... కడార్ల కిరణ్

# స్టార్టప్‌లకు స్వర్గధామం..

### 'టీహబ్'తో యువత కల సాకారం

ఆవిష్కరణల విధానం, అంకుర సంస్థలకు అందించిన ప్రోత్సాహకాలతో అభివృద్ధి చెందుతున్న అంకుర సంస్థలకు తెలంగాణ రాష్ట్రం ఆలవాలమైంది. పారిశ్రామిక వృద్ధికి నూతన ఆవిష్కరణలు, సాంకేతిక విజ్ఞానం ప్రధాన కారకాలు. వినూత్న విధానాల ద్వారా పారిశ్రామిక రంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నది. ఫలితంగా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి.



**రా**యితీలు, ప్రోత్సాహకాలతో స్టార్టప్ సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. ఏటా అనేక మంది ఔత్సాహికులు 'టీహబ్' సహకారంతో తమ ప్రతిభ దేశ ప్రగతికి ఉపయోగపడేలా కృషి చేస్తున్నారు. వాటిలో కొన్ని జాతీయ ప్రాముఖ్యతను పొందాయి. "డార్విన్ బాక్స్" అనే అంకుర సంస్థ తెలంగాణ నుండి యూనికార్న్ క్లబ్‌లో చేరిన మొదటి అంకుర సంస్థ. టీ-హబ్‌లో పొదిగిన "స్కైరూట్ ఏరోస్పేస్" అనే మరో అంకుర సంస్థ భారత దేశపు మొట్టమొదటి ప్రైవేట్ రాకెట్ 'ప్రారంభ్'ను అభివృద్ధి చేసి విశిష్ట హోదాను పొందింది. తెలంగాణలో అంకుర సంస్థల వృద్ధికి తోడ్పాటు అందించేందుకు డీపీఐఐటీ, వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ నేషనల్ స్టార్టప్ అవార్డ్స్ 2022లో టీ-హబ్ 'భారతదేశంలో ఉత్తమ ఇంక్యుబేటర్' అవార్డును కైవసం చేసుకున్నది.

టీ-హబ్ (టీ-హబ్ 2.0) రెండవ దశ 2022 జూన్ 28న ప్రారంభమైంది. ఇది 4,000 అంకుర సంస్థల ఆవిష్కరణ, పర్యావరణ వ్యవస్థ ఇతర కీలక అంశాలను కలిగి ఉండే సామర్థ్యంతో ప్రపంచంలోనే అతి పెద్ద ఆవిష్కరణ శిబిరాల్లో ఒకటి. ప్రభుత్వం చొరవ వల్ల 2022-23లో (జనవరి 2023 వరకు) రూ.20,237 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. 2,518 కొత్త పరిశ్రమలు ఏర్పాటవడంతో 72,908 మందికి ఉపాధి లభించింది. ప్రస్తుతం, రాష్ట్రంలో 78 ఇంక్యుబేటర్లు, యాక్సిలరేటర్లు, కో-వర్కింగ్ స్పేస్‌లు ఉన్నాయి. ఇవి లైఫ్ సైన్సెస్, ఫిన్టెక్, అగ్రి టెక్, డిజిటల్ మొదలైన వాటిపై ప్రత్యేక దృష్టి సారించాయి.

### సేవల రంగం


**తెలంగాణలో** సేవల రంగం 2022-23లో ప్రస్తుత ధరల ప్రకారం 17.5% వృద్ధిని సాధించింది. 2020-21లో కొవిడ్ సమయంలో సేవల రంగం బాగా దెబ్బతినగా, 2022-23లో ఈ రంగం కొవిడ్ ముందున్న జీవీఏ (2019-20) కంటే 41.1% ఎక్కువగా ఉన్నది. ఇది తెలంగాణలో ఉత్పత్తి అయ్యే సేవల డిమాండ్‌లో బలమైన పునరుజ్జీవనాన్ని ప్రతిబింబిస్తున్నది. తాత్కాలిక ముందస్తు అంచనాల ఆధారంగా, 2022-23లో, ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర జీఎస్‌వీఏలో ఈ రంగం 62.8% వాటాలు కలిగి ఉన్నది.

... భరద్వాజ

# మెతుకు సీమ మెరిసింది

### నియోజకవర్గంలో ప్రగతి పరుగులు.. రూ.3737.85 కోట్లతో అభివృద్ధి పనులు

మెతుకు సీమ మెదక్ ఉద్యమాల్లో కీలక భూమిక పోషించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులోనూ జిల్లా ప్రత్యేకతను చాటుకున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమంలో ప్రగతి పరుగులు తీస్తున్నది. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో అన్ని వసతులు అందుబాటులోకి వచ్చాయి. మరోసారి మెదక్ ఖిల్లాపై గులాబీ జెండాను ఎగురవేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. -మెదక్, (నమస్తే తెలంగాణ)



▪ ఏరియల్ వ్యూ



**ఒ**కప్పుడు మెతుకు సీమగా పేరొందిన మెదక్ సమైక్య పాలనలో అభివృద్ధి కుంటుపడింది. 2014కు ముందు ఎక్కడా రహదారులు లేవు. చాలా గ్రామాల్లో తాగునీరు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయానికి రోజుకు నాలుగు గంటలు కూడా విద్యుత్ సరఫరా అయ్యేది కాదు. గత తొమ్మిదిన్నరేండ్లలో నియోజకవర్గంలో ఏ మండలం, ఏ గ్రామంలో చూసినా కళ్లెదుట అభివృద్ధే కనిపిస్తున్నది. ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రగతి పరుగులు పెడుతున్నది.

#### ఘనపూర్ ప్రాజెక్టుకు రూ.143 కోట్లు...

115 ఏండ్ల క్రితం నిర్మించిన ఘనపూర్ ప్రాజెక్టును 2014 డిసెంబర్ 17న సీఎం కేసీఆర్ సందర్శించి రూ.50 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.43.64 కోట్లు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టుకు వనదుర్గగా కేసీఆర్ నామకరణం చేశారు. అనంతరం ప్రాజెక్టు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసింది. ఆనకట్ట ఎత్తు పెంపు వల్ల 30 వేల ఎకరాలకు సాగునీరు అందడం ద్వారా భూములన్నీ సస్యశ్యామలం కానున్నాయి.

#### కోట్లాది రూపాయల కేటాయింపు...


నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం వివిధ శాఖలకు కోట్లాది రూపాయలు కేటాయించింది. ఇరిగేషన్‌కు రూ.400 కోట్లు, పంచాయతీరాజ్‌కు రూ.462 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.305 కోట్లు, విద్యుత్‌కు 60 కోట్లు, చేప పిల్లల పంపిణీ కోసం రూ.8.50 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.543 కోట్లు, వైద్య, ఆరోగ్య శాఖకు రూ.100 కోట్లు కేటాయించింది. మెదక్, రామాయంపేట మున్సిపాలిటీల అభివృద్ధి కోసం రూ.106 కోట్లు మంజూరు చేసింది. మిషన్ భగీరథ పథకం కింద రూ.454 కోట్లతో మంచినీటి సరఫరా పనులు పూర్తయ్యాయి. ఏడుపాయల దేవస్థానం అభివృద్ధికి రూ.10 కోట్లు, మిషన్ కాకతీయ కోసం రూ.340 కోట్లు కేటాయించింది.

#### నెరవేరిన మెదక్ ప్రాంత వాసుల చిరకాల స్వప్నం రైల్వేలైన్...

మెదక్ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం రైల్వేలైన్ ఏర్పాటును సీఎం కేసీఆర్ నెరవేర్చారు. రూ.205 కోట్లతో అక్కన్నపేట-మెదక్ వరకు 17.2 కిలోమీటర్ల పొడువునా రైల్వేలైన్ నిర్మించారు. అక్కన్నపేట స్టేషన్ నుంచి ఈ రైలుమార్గం ప్రారంభమవుతున్నది. లక్ష్మాపూర్, శమ్నాపూర్, మెదక్‌లో రైల్వేస్టేషన్లు ఏర్పాటు చేశారు.




### Welldone: మెట్లబావికి పూర్వవైభవం



"చారిత్రక కట్టడాల పరిరక్షణకు బీఆర్ఎస్ సర్కారు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. సికింద్రాబాద్ నియోజకవర్గం బన్సీలాల్‌పేట్‌లో వందేండ్ల క్రితం నిర్మించిన నాగన్న కుంట మెట్ల బావిని పునరుద్ధరించి భావితరాలకు గత వైభవాన్ని కండ్ల ముందుంచింది. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలు 'ది రెయిన్ వాటర్ ప్రాజెక్ట్' అనే స్వచ్ఛంద సంస్థలు ఏడాదిపాటు శ్రమించి సుమారు 40 ఏండ్లుగా పేరుకుపోయిన నాలుగు మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బావిలో నుంచి తొలగించాయి. పరిసర ప్రాంతాలను సుందరీకరించడంతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నది. - బన్సీలాల్‌పేట్


# గ్రేట్ వే ఆఫ్ హైదరాబాద్.. గచ్చిబౌలి

### గచ్చిబౌలి జంక్షన్‌లో గణనీయంగా మార్పులు

### ఒకే జంక్షన్‌లో మూడు ఫ్లై ఓవర్ల నిర్మాణం

'తెలంగాణ ఏర్పాటైన తర్వాత గచ్చిబౌలి జంక్షన్ ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. ఐటీ కారిడార్‌లో గచ్చిబౌలి అంటే ఆధునికతకు, ఐటీ కంపెనీలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎన్నో మౌలిక వసతులు కల్పించడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అనే మాటకు చోటే లేదు. బీఆర్ఎస్ సర్కార్ ఇక్కడ జంక్షన్‌లో వందల కోట్లతో ఫ్లై ఓవర్లు నిర్మిస్తుండడంతో వాహనదారులకు ఎంతో మేలు జరుగుతుంది.'

**ఒ**కప్పుడు సంపన్నుల నివాస ప్రాంతమంటే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పేర్లు మాత్ర మే వినపడేవి. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గచ్చిబౌలి అత్యంత కీలకమైన ప్రాంతంగా ఎదిగింది. నగరం నలుమూలల ఉన్న ఐటీ ఉద్యోగులు రోజూ గచ్చిబౌలికి రావాల్సిన పరిస్థితి నెలకొన్నది. అంతలా గచ్చిబౌలి అభివృద్ధి చెందింది. ముఖ్యంగా ఐటీ కారిడార్ గచ్చిబౌలిలో గణనీయమైన మార్పులు సంతరించుకున్నాయి. ఔటర్ రింగు రోడ్డు నుంచి హైదరాబాద్ మహానగరానికి ముఖద్వారంగా గచ్చిబౌలి నిలిచింది. నగరం నుంచి ఓఆర్ఆర్‌పైకి వెళ్లాలంటే ప్రధాన మార్గం ఇక్కడి నుంచే ప్రారంభమవుతున్నది. అంతే కాదు... శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి గంటకు 120 కి.మీ వేగంతో కేవలం 20 నిమిషాల్లో వెళ్లే మార్గం గచ్చిబౌలి జంక్షన్ నుంచే మొదలవుతున్నది.





### ఒక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మరో రెండు ఫ్లై ఓవర్లు

**ఉమ్మడి** రాష్ట్రంలో నిర్మించిన ఒక ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై బీఆర్ఎస్ ప్రభుత్వం మరో రెండు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో ఒకటి ఔటర్ రింగు రోడ్డు మీది నుంచి నేరుగా మాదాపూర్, ఐకియా, మైండ్ స్పేస్ జంక్షన్‌లకు వెళ్లేలా రూ. 270 కోట్లతో ఫ్లై ఓవర్‌ను నిర్మించింది. ప్రస్తుతం మరో ఫ్లై ఓవర్‌ను ఓఆర్ఆర్ మీదుగా కొండాపూర్ వైపు (పాత ముంబయి హైవే) నిర్మిస్తున్నది. ఇందుకోసం రూ.180 కోట్లు ఖర్చు చేస్తున్నది. ఇలా ఒకే జంక్షన్‌లో రూ.450 కోట్లతో అత్యాధునిక నిర్మాణ శైలిలో ఫ్లై ఓవర్లను నిర్మిస్తున్నది. ఇక్కడ చేపట్టిన మూడో ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయితే ఒక జంక్షన్‌లో మూడు ఫ్లై ఓవర్లు ఒకదానిపై మరొకటి ఉండడం, అవి కూడా అత్యంత ఆధునికంగా.. ఇంజినీరింగ్ నైపుణ్యానికి తార్కాణంగా నిలుస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

... బరిగెల శేఖర్